క్లుప్తంగా

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరు వాసవీ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందుందని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు చెన్నగిరి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఊటుకూరు వాసవీ క్లబ్ ఆవరణలో జోన్ 3 ప్రాంతీయ సమావేశం జరిగింది. సమాజంలో పేదరిక నిర్మూలన, విద్యావ్యాప్తి తదితర అంశాలను ప్రధానంగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీనివాసరావు సూచించారు. క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు

ముసునూరు: అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిల్లబోయినపల్లిలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్యూర్ కోడ్‌తో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ పారదర్శకంగా జరుగుతోందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ప్రశాంతి, ఎంపీడీవో బీఏ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11కేవీ సాయిపురం కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా కొన్ని ప్రాంతాలలో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మైలురాయి సెంటర్ ఏరియా, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఏరియా, అనిల్ క్యాస్టాల్ అపార్ట్‌మెంట్ ఏరియా, వన్ సెంటర్, ఎల్ఐసీ కాలనీ ఏరియా, సాయిపురం కాలనీ ఏరియాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు వివరించారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన అవసరం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్ వ్యాధులపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ వైద్యురాలు, క్యాన్సర్ వ్యాధుల జిల్లా కేర్ పర్సన్ గంగా విజయవాణి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్కే నగర మహిళ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా వైద్యశాలలో మహిళల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళల్లో రొమ్ము, గర్భాశయ, అండాశయ క్యాన్సర్లు ఎక్కువగా ప్రబలుతున్నాయని తెలిపారు. సమయానుకూలంగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మణిపాల్ హాస్పిటల్ సహకారంతో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సదస్సులో ముఖ్యఅతిథిగా దేవినేని కిషోర్‌కుమార్, విశిష్ట అతిథి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, దేవినేని జోనికుమారి, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస రావు, మణిపాల్ డాక్టర్ లక్ష్మీప్రియాంక, డాక్టర్ గంగ మధుసూదనరావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆప్కెల్ రోడ్, పుట్లమ్మ గట్టు ఏరియాలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు తెలిపారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాలను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ కృష్ణబాబు, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మాస్కితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పైప్‌లైన్ నిర్మాణానికి సుమారు రూ.40 లక్షలు వ్యయం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్వర్ణ థియేటర్ ప్రాంతంలో పైప్ లైన్ల లీకేజీని పరిశీలించారు. గాజులపేటకు కూడా కొత్త పైప్‌లైన్ పనులు ప్రారంభించాలని ఈఈ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

అనాథలు, వృద్ధులకు చేయూత

మైలవరం: మదర్ థెరీసా వర్ధంతి సందర్భంగా మైలవరంలోని మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథలు, వృద్ధులకు భోజనం, పండ్లు, మందులకు ట్రస్టు చైర్మన్ కోయ సుధా శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కోయ సుధా మాట్లాడుతూ మదర్ థెరీసా స్ఫూర్తితో సమాజంలో నిరుపేదలకు, అనాథలు, వృద్ధులు, వితంతువులకు తమ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా గతేడాది నుంచి 20మంది అనాథ వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌తో పాటు ప్రతి నెల మందుల కోసం కొంత ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ట్రస్టు కోశాధికారి డి. విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

సమాజానికి గురువులే మార్గ నిర్దేశకులు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలు చోట్ల టీచర్లకు ఘన సత్కారాలు

మైలవరం: నేటి సామాజిక అభివృద్ధికి గురువులే కాంతి కిరణాలు అని మండల విద్యాశాఖాధికారి రాజు అన్నారు. మైలవరంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు.

- మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- మైలవరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్న రాణి స్వామి, మండల విద్యాశాఖాధికారి బండి రాజు, ఎల్. బాలు ఆధ్వర్యంలో మండలానికి విశిష్ట సేవలందించినందుకు గాను 2025 మండల ఉత్తమ ఉపాధ్యాయులు సీహెచ్ సుధారాణి, వెల్వడం, వి. పూర్ణిమ, దాసుళ్లపాలెం, ఐ.ఉదయలక్ష్మి, మైలవరం, బి.వప్రామ్ పుల్లూరు, జి. వరప్రసాద్, మొర్సుమల్లి, ఎస్ శేషగిరిరావు పుల్లూరు, పీ నాగేశ్వరరావు, బొర్రగూడెం, ఉద్యోగవిరమణ పొందిన ఉపాధ్యాయులు పి. గోపాల్, ఇందుపల్లి నీలావతమ్మ, ఎం. విజయలక్ష్మి, మైలవరం మండలం విద్యాశాఖాధికారిగా పనిచేసిన పీవీ నరసింహారావులను సత్కరించారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

తిరువూరు: గురుపూజోత్సవం సందర్భంగా తిరువూరు నియోజకవర్గంలో శుక్రవారం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కోశాధికారి ముత్యాల కిషోర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వి. శ్రీధర్, జెస్సీ రాణిలను తిరువూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సన్మానించారు.

- గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.
- ఏకొండూరు మండలంలోని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఏకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరిపారు. ఉపాధ్యాయులు ఆర్. కల్యాణి, కె. ప్రియాంక ప్రశాంతి, వి. జయశ్రీ, జె. నాగకుమారి, ఎస్. సామ్యూల్, జి. రమేష్, పి. రవికుమార్‌లను ఏకొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, డీపీఆర్‌టీయూ నాయకులు రవి కృష్ణ కుమార్, సురేష్‌బాబు, గిరిబాబు సన్మానించారు.



ఏకొండూరు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ



మైలవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మండల విద్యాశాఖాధికారులు

లయన్స్ ఆధ్వర్యంలో..

తిరువూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గురుపూజోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీ రావు, చలమాల శంకరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అచంటి రవి, సుకన్య, రవిబాబు, కోటేశ్వరరావు, రాంప్రదీప్, గోపయ్య, కృష్ణమోహన్‌లను సన్మానించారు. లయన్స్ క్లబ్‌ల సభ్యులు పాల్గొన్నారు.

త్రివిధ హైస్కూల్‌లో..

నూజివీడు: పట్టణంలోని త్రివిధ హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ పాఠశాలలోని సీనియర్ ఉపాధ్యాయులైన కాత్యాయని, జయశ్రీ, రజనీ, రాజ్యలక్ష్మి, రేణుక, హిందీ ఉపాధ్యాయుడు రామకృష్ణను సన్మానించారు.

విస్సన్న పేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని స్థానిక లయన్స్‌క్లబ్ మల్టీ సర్వీస్ కమ్యూనిటీ హాలులో శుక్రవారం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం రంగా శోభారాణి, కూనపు రాజుపర్వ హైస్కూల్ హెచ్ఎం గంగిరెడ్డి ప్రసాద్, ఏపీ మోడల్ స్కూల్ గంపలగూడెం టీచర్ అంకం దుర్గాసుందరిలను సన్మానించారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం..

ఆగిరిపల్లి: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర కీలకమని విద్యార్థులు ఆలోచన విధానంలో, ప్రవర్తనలో మార్పు తీసుకురాగల శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేకమంది అనాథలు, వికలాంగ బాలలకు హీల్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఎస్ఐ శుభ శేఖర్, హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు యార్లగడ్డ లతా చౌదరి తదితరులు పాల్గొన్నారు



పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న డీఎస్పీ ప్రసాద్

ఉత్తమ ఉపాధ్యాయ సాహితీ పురస్కారం



వనజాక్షికి ఉత్తమ ఉపాధ్యాయ సాహితీ పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని కొండపల్లి జెడ్పీ బాలికోన్నత ప్లస్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు పబ్బిశెట్టి వనజాక్షి మండలి వెంకట కృష్ణారావు ఉత్తమ ఉపాధ్యాయ సాహితీ పురస్కారం అందుకున్నారు. విజయవాడ రామ్మోహనరావు గ్రంథాలయంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ వియన్నారావు వనజాక్షికి అవార్డు అందజేసి సత్కరించారు. హెచ్ఎం హేమలత, ఎస్ఎంసీ చైర్మన్ బాజీ బీ, ఉపాధ్యాయులు అభినందించారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు గురువులను మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందనలు

ఆగిరిపల్లి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న అంకం వెంకటేశ్వరావును మండల విద్యాశాఖ అధికారులు హేబేలు, ఆనంద్ కుమార్ అభినందించారు. శుక్రవారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డీఈఓ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఆగిరిపల్లి మండల ఎస్టీయూ శాఖ అధ్యక్షుడు మక్కే వేణుగోపాలరావు, ప్రధానోపాధ్యాయులు తాడి ప్రసాద్ వెంకటేశ్వరరావును అభినందించారు.



నూజివీడులోని త్రివిధ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్



తిరువూరులో రిటైర్డు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తిరువూరు లయన్స్ క్లబ్ సభ్యులు



మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలు దుర్గాసుందరి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ ప్రార్థనలు

తిరువూరు: మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా శుక్రవారం తిరువూరు నియోజకవర్గంలోని ముస్లింలు మసీదుల్లో మిలాద్ ఉన్ నబీ ప్రార్థనలు జరిపారు. తిరువూరులోని జామియా మసీదు, కౌసర్, బిలాల్, రాజుపేట, గానుగపాడు, ఆంజనేయపురం మసీదులలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి, ధర్మం, సమానత్వం మహ్మద్ ప్రవక్త ఉద్బోధించారని జామియా మసీదు మత గురువు రజ్వీ పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో ప్రతి ముస్లిం నడవాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కాంక్షిస్తూ ముస్లింలు తిరువూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు.

ప్రత్యేక ప్రార్థనలు..

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు మహ్మద్ ప్రవక్త జయంతి పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొండపల్లి షాబుఖారీ మసీదులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ పాల్గొన్నారు. మసీదు పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్‌రజా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మహ్మద్ ప్రవక్త తోటివారితో ప్రేమ, విశ్వాసం, నమ్మకం కలిగి ఉండాలని సూచించారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబుతో కలసి ముస్లిం మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కేతనకొండలో మత గురువు రహమతుల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్త చిహ్నంగా ఇస్లాం జెండా ఆవిష్కరించి ఊరేగింపు జరిపారు.

కొత్త వెలుగులు నింపాలి..

మైలవరం: మిలాద్ ఉన్ నబీ ముస్లింల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారీబాబా వారి దర్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌ను ఘనంగా స్వాగతించారు.



తిరువూరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



కొండపల్లిలో మహిళలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత, మతగురువు అల్తాఫ్‌రజా

యూరియా కోసం పరుగులు

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో రైతులు సహకార సొసైటీలు, మన గ్రోమోర్ సెంటర్ల వద్దకు శుక్రవారం పరుగులు తీశారు. మైలవరం మండల పరిధిలో వెల్వడం, చంద్రాల సహకార సొసైటీలు, మన గ్రోమోర్ సెంటర్, జి.కొండూరు మండల పరిధిలో కవులూరు, వెలగలేరు, గంగినేని, కుంటముక్కల, వెల్లటూరు సహకార సొసైటీలు, మన గ్రోమోర్ సెంటరు వద్ద యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఐదు ఎకరాల రైతుకి రెండు బస్తాల యూరియా, ఒకటి రెండు ఎకరాలు ఉన్న రైతుకి ఒక బస్తా చొప్పున అధికారులు యూరియాని పంపిణీ చేశారు. ఐదు ఎకరాలకు పైగా సాగు చేపట్టిన రైతులు యూరియా సరిపడా లభించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై మైలవరం ఏడీఏ ఎం.శ్రీనివాసరావు వివరణ కోరగా ప్రస్తుతం జి.కొండూరు మండల పరిధిలో సొసైటీలలో 75టన్నులు, మన గ్రోమోర్‌సెంటర్‌లో 15టన్నులు, మైలవరం మండల పరిధిలో సొసైటీలలో 60టన్నులు, ప్రయివేటు డీలర్ల వద్ద 60టన్నులు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో సొసైటీలలో 45టన్నులు పంపిణీ జరుగుతుందన్నారు. అదేవిధంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలానికి 40టన్నులు, జి.కొండూరు మండలానికి 70 ట న్నులు, మైలవరం మండలానికి 20టన్నులు యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు

మైలవరం: యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలవరం మండలంలోని పలు పీఏసీఎస్ కార్యాలయాల వద్ద రైతులు యూరియాను తీసుకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. 20 రోజుల తరువాత మైలవరంలో రైతులకు యూరియా అందుబాటులోకి వచ్చింది. దీంతో రైతులు గ్రోమోర్, షాపుల వద్ద బారులు తీరారు. అధికారులు మాత్రం ఒక్క కట్ట యూరియా ఇస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కోసం బారులు

విస్సన్నపేట: స్థానిక గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. రైతులకు చెందిన పట్టాదారు పాస్ పుస్తకం పరిశీలించి యూరియాను పంపిణీ చేస్తుండటంతో రైతులు ఎరువుల దుకాణం వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. పోలీసులు రైతులను లైనులో పంపించి ఎరువుల దుకాణం వద్ద ఎటువంటి తోపులాటలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా

తిరువూరు: మండలంలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు యూరియా సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. కోకిలంపాడు, కొత్త కోకిలంపాడు గ్రామాలకు శనివారం ఉదయం 10గంటల నుంచి యూరియా పంపిణీ చేస్తామని, టేకులపల్లి పీఏసీఎస్‌కు కూడా 24.975 టన్నుల యూరియా రానున్నందున రైతులకు అందే ఏర్పాట్లు చేస్తామన్నారు.

యూరియా కొరత లేదు

నూజివీడు: నూజివీడు డివిజన్‌లో యూరియా, ఇతర రసాయన ఎరువుల కొరత లేదని, రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని నూజివీడు ఏడీఏ జి. విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోని పీఏసీఎస్‌లలో యూరియా స్టాకు ఉందన్నారు. యూరియా సరఫరా, విక్రయాలపై సబ్‌కలెక్టర్ ప్రతిరోజూ పరిశీలన చేస్తున్నారన్నారు. ఎలాంటి అనుమానాలున్నా 98499 03964, 0865 6232717లో సంప్రదించవచ్చన్నారు.



జి.కొండూరు మన గ్రోమోర్‌సెంటర్ వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు



విస్సన్నపేట గ్రోమోర్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామి వారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శుక్రవారం శాంతి కల్యాణాన్ని ఆలయ అర్చకస్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో నేత్రపర్వంగా నిర్వహించారు. విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మాంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం..

ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు.

ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలి: ఈఓ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన ఇంజినీరింగ్ పనులు సకాలంలో పూర్తి కావాలని దుర్గగుడి ఈఓ శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న పలు ఇంజినీరింగ్ పనులను ఈఓ శీనానాయక్, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు శుక్రవారం పరిశీలించారు. మహామండపం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల పోటు, కనకదుర్గా నగర్‌లో లడ్డూ ప్రసాద విక్రయ కౌంటర్లను పరిశీలించారు. నూతన భవనాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయి. 24 గంటల విద్యుత్ సరఫరా కోసం అన్ని గ్రామాల్లో కొత్త విద్యుత్ లైన్ స్తంభాలు వేస్తున్నారు. నెల క్రితం చాట్రాయి పోలవరం గ్రామాల మధ్య వేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయి. విద్యుత్ సరఫరా చేసే ముందు ఒరిగిన స్తంభాలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కోలాహలంగా నిమజ్జనాలు



చాట్రాయిలో ఉత్సాహంగా వినాయక నిమజ్జన ఊరేగింపు

చాట్రాయి: గణపతి నవరాత్రుల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనాలు కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాట్రాయి కోదండ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని చిత్ర విచిత్ర వేషధారణలు, తీన్మార్ డప్పు వాయిద్యాలతో, రంగులు చిమ్ముకుంటూ టపాసులు పేల్చుతూ ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. కృష్ణారావుపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనాలు

విస్సన్నపేట: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి పందిళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో మేలతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మండలంలోని పుట్రేల గ్రామంలో రావిచెట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి పందిరి వద్ద శ్రీలక్ష్మీగణపతి కమిటీ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పుట్రేల రావిచెట్టు సెంటర్‌లో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు